తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం - 22 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 168 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



ఉచిత ఐవీఎఫ్ చికిత్సతో సంతాన సాఫల్యం

- గాంధీ ఆసుపత్రిలో ముగ్గురు శిశువుల జననం
- ఏళ్ల తరబడి ఎదురుచూసిన దంపతులకు తల్లిదండ్రులయ్యే అవకాశం
- పేద కుటుంబాలకు ఉచితంగా సంతాన సాఫల్య చికిత్స
- ఇటీవల ఒకే కాన్పులో ముగ్గురు శిశువుల జననం

2 లో..



మృతులైన గిగ్ వర్కర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం

- స్విగ్గీ డెలివరీ భాగస్వామి కుటుంబానికి చేయూత
- ఉబర్ డ్రైవర్ కుటుంబానికి పరిహారం చెక్కు
- కుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వ భరోసా
- సామాజిక భద్రతకు కట్టుబడి ఉన్నామని మంత్రి వివేక్ వెల్లడి

2 లో..

కాళోజీ కళాక్షేత్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు చోటు లేదు

- కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకే కేటాయించాలని సీఎం ఆదేశం
- కార్యాలయాల తరలింపుపై వచ్చిన వార్తల నేపథ్యంలో స్పందన
- కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి కార్యక్రమాలు ఖరారు చేయాలని సూచన



హనుమకొండ, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు):

ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ఆదేశాలు జారీ చేశారు. కాళోజీ పేరుతో నిర్మించిన కళాక్షేత్రం ఆయన ఆశయాలకు, సాహిత్య స్ఫూర్తికి ప్రతీకగా నిలవాలని, ఆ ప్రాంగణాన్ని ఇతర అవసరాలకు వినియోగించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది.కాళోజీ కళాక్షేత్రంలోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తున్నారంటూ వార్తలు వెలువడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి స్పందించారు. ప్రభుత్వ కార్యాలయాలను అక్కడికి తరలించవద్దని కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కళాక్షేత్రం నిర్మాణం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాన్ని దృష్టిలో ఉంచుకుని దాని వినియోగం ఉండాలని సూచించారు.కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పించాలని పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావు తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న ప్రజాకవి. తన రచనలు, కవిత్వం, ప్రజా ఉద్యమాల ద్వారా సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారు. ప్రజల భాషలో ప్రజల బాధలను, ఆకాంక్షలను వ్యక్తం చేసిన ఆయన సాహిత్య సేవలకు గుర్తింపుగా హనుమకొండలో కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించారు.

అలాంటి మహనీయుడి స్మారకంగా ఏర్పాటైన ప్రాంగణం ఆయన స్ఫూర్తిని ప్రతిబింబించే కార్యక్రమాలకు వేదిక కావాలన్నది ప్రభుత్వ ఆలోచనగా ఈ ఆదేశాల ద్వారా స్పష్టమవుతోంది. కళాక్షేత్రంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో చర్చించాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఫౌండేషన్ సభ్యుల అభిప్రాయాలు, సూచనలు తీసుకుని కళాక్షేత్రాన్ని ఏ విధంగా వినియోగించాలనే అంశంపై కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కళా ప్రదర్శనలు, సాహిత్య సమావేశాలు, కవుల సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనువైన వేదికగా దీనిని తీర్చిదిద్దేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి తాజా ఆదేశాలతో కాళోజీ కళాక్షేత్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు అంశానికి తెరపడినట్లయింది. ఈ ప్రాంగణం కళలు, సాహిత్యం, సంస్కృతికి మాత్రమే అంకితం కావాలన్న నిర్ణయం కాళోజీ అభిమానులు, సాహితీవేత్తలు, సాంస్కృతిక రంగాల వారికి ప్రాధాన్యమైనదిగా నిలవనుంది.



తెలంగాణలో 4,000 కోట్ల పెట్టుబడికి సఫ్రాన్ ఆసక్తి

- హైదరాబాద్‌లో ఏరోస్పేస్ తయారీ రంగ విస్తరణకు అవకాశం
- పారిస్‌లో సఫ్రాన్ ప్రతినిధులతో భట్టి విక్రమార్క చర్చలు
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో ఒప్పందంపై ఆశలు

పారిస్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఏరోస్పేస్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తెలంగాణలో సుమారు రూ.4,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించింది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో విమాన ఇంజిన్లు, విడిభాగాల తయారీ రంగాలకు మరింత బలం చేకూరనుంది. ఇప్పటికే హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థ తన వ్యాపారాన్ని మరింత విస్తరించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ పెట్టుబడితో రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడటంతో పాటు అంతర్జాతీయ విమానయాన పరిశ్రమలో

మిగతా 2 లో..

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: జూపల్లి

కల్వకోల్‌లో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు

పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా పండుగ సాయన్న జీవితం

మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజీ, మార్కెటింగ్ సదుపాయాల కల్పనకు కృషి

కల్వకోల్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో పండుగ సాయన్న విగ్రహాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ఎన్నో అవరోధాలు ఎదురైనా పేదల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం నేటి తరాలకు ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన విగ్రహం కేవలం ఒక ప్రతిమ మాత్రమే కాదని, పేదల ఆత్మగౌరవానికి, హక్కుల సాధన కోసం సాగిన పోరాటానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిబా ఫూలే, పండుగ సాయన్న వంటి మహనీయుల జీవితాలు సమాజానికి మార్గదర్శకమని మంత్రి తెలిపారు. వారి ఆలోచనలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని పేదల అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పండుగ సాయన్న వంటి పోరాట యోధుల సేవలను భావితరాలకు పరిచయం చేయడంలో ఇలాంటి విగ్రహాల ఏర్పాటు కీలకమని అభిప్రాయపడ్డారు. ముదిరాజ్ సమాజం ఎన్నో ఏళ్లుగా చేసిన కృషి, ఎదుర్కొన్న

మిగతా 2 లో..


మాదకద్రవ్యాల నిర్మూలన జాతీయ ప్రాధాన్యం: కిషన్ రెడ్డి

హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల రహిత భారత్‌పై నగర స్థాయి సదస్సు

యువత, కుటుంబాల భవిష్యత్తుకు డ్రగ్స్ ముప్పు

తెలుగు రాష్ట్రాలకూ విస్తరిస్తున్న మాదకద్రవ్యాల సమస్య

డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని సామూహిక ప్రతిజ్ఞ



హైదరాబాద్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): మాదకద్రవ్యాల వినియోగం కేవలం సామాజిక సమస్య మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు, యువతకు, కుటుంబాలకు తీవ్రమైన ముప్పుగా మారుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన మాదకద్రవ్యాల రహిత భారత్ నగర స్థాయి సదస్సులో ఆయన పాల్గొన్నారు. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమానికి మద్దతుగా ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని అడ్డుకోవడం, దేశ భద్రతను బలోపేతం చేయడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పుడు మాదకద్రవ్యాల నిర్మూలన కూడా దేశం ముందున్న కీలక ప్రాధాన్యంగా మారిందని వివరించారు. డ్రగ్స్ ప్రభావం వ్యక్తుల జీవితాలకే పరిమితం కాకుండా కుటుంబ వ్యవస్థను, సమాజాన్ని కూడా దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల సమస్య పంజాబ్ రాష్ట్రాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ముప్పు విస్తరిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బస్తీల నుంచి ఐటీ కారిడార్ల వరకు యువతను లక్ష్యంగా చేసుకుంటున్న ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు.

మిగతా 2 లో..


పల్నాడు వాటర్‌గ్రిడ్ పనులు నిలిపివేయాలి

రేవంత్ ప్రభుత్వంపై జలదోపిడీకి సహకరిస్తోందంటూ విమర్శలు

సాగర్ ప్రాజెక్టుపై కవిత వారం రోజుల గడువు

గడువులోగా స్పందించకుంటే వేలాది మందితో డ్యామ్ ముట్టడి హెచ్చరిక

కేంద్ర మంత్రులు, ఎంపీలు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి



హైదరాబాద్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): నాగార్జునసాగర్ జలాశయం సమీపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పల్నాడు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనులను వారం రోజుల్లోగా నిలిపివేయించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వేలాది మందితో నాగార్జునసాగర్ డ్యామ్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి వల్లే ఏపీ ప్రభుత్వం జలదోపిడీకి పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. కాకపోతే ఈ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని కోరారు. చంద్రబాబును ప్రజాభవన్‌కు ఆహ్వానించి గౌరవించిన సందర్భంలోనే తెలంగాణ నీళ్లను గురుదక్షిణగా అప్పగించారని కవిత విమర్శించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలోనూ ముఖ్యమంత్రి అవసరమైన అధికారిక విధానాలను పాటించలేదని ఆరోపించారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం కోసం డిమాండ్ చేయకుండా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో అనధికారిక సమావేశానికి వెళ్లి ఏపీ ప్రాజెక్టుకు అంగీకరించి వచ్చినట్లు విమర్శించారు. ఆ పరిణామాల నేపథ్యంలోనే ఇప్పుడు నాగార్జునసాగర్ జలాలను తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

తెలంగాణలో 4,000 కోట్ల పెట్టుబడికి సఫ్రాన్ ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంది.

ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పారిస్ సమీపంలోని ఎవ్రీకార్బెల్‌లో ఉన్న సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ సంస్థ ఉన్నతాధికారులతో సమావేశ మై తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల మైన పరిస్థితులు, ప్రస్తుతం కొనసాగుతున్న కార్యకలాపాల విస్తరణ, కొత్త తయారీ యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ రంగంలో ఉన్న అవకాశాలను వివరించారు. పెట్టుబడుల ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. బోయింగ్, ఎయిర్‌బస్ వంటి అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలకు ఇంజిన్లు సరఫరా చేస్తున్న సఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ముఖ్యమైన పరి ణామమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హై దరాబాద్‌లో సఫ్రాన్ ఇప్పటికే గణనీయమైన స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరి శ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులు తెలంగాణలో అందుబా టులో ఉన్నాయని, అత్యాధునిక మౌలిక సదు పాయాలు కూడా రాష్ట్రానికి అనుకూలంగా ఉన్నాయని వివరించారు. పరిశ్రమలకు వేగంగా అనుమతులు మంజూరు చేసే ప్రభు త్వ విధానాలు పెట్టుబడిదారులకు మరింత భరోసా కల్పిస్తున్నాయని చెప్పారు.

సఫ్రాన్ ప్రతినిధులతో జరిగిన సమావేశం ఫలప్రదంగా సాగిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. డిసెంబర్ 2026లో నిర్వ హించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పారిస్ నుంచి సంస్థ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సదస్సు సందర్భంగా సుమారు రూ.4,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనకు సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే పెట్టుబడి ప్రతిపాదనపై చర్చలు కొనసాగుతున్న నే పథ్యంలో ఒప్పందం ఖరారైతేనే తదుపరి కార్యాచరణపై స్పష్టత రానుంది. ఈ ప్రతిపా దనను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం సంస్థతో సంప్రదింపులు కొనసాగించనుంది. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు. సఫ్రాన్ సంస్థ తరపున ఇండస్ట్రియల్ అండ్ సప్లై చైన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లారెంట్ మజౌ, ఇండస్ట్రియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ రొటేటింగ్ పార్ట్స్ డైరెక్టర్ జూలియన్ డి 'ఒరాజియో తదితరు లు సమావేశంలో పాల్గొన్నారు. ఈ పెట్టుబడి ప్రతిపాదన సాకారమైతే హైదరాబాద్ ఏరో స్పేస్ రంగంలో మరింత కీలక కేంద్రంగా ఎదిగేందుకు దోహదపడనుంది. విమాన యాన విడిభాగాల తయారీ, సరఫరా వ్యవ స్థలు, నైపుణ్య ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణకు కూడా మార్గం సుగమం కావచ్చని పారిశ్రామిక వర్గాలు భావిస్తున్నాయి.

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: జూపల్లి

(మొదటి పేజీ తరువాయి)

అడ్డంకులు, అవమానాల అనంతరం సాధి స్తున్న పురోగతి అభినందనీయమని జూపల్లి కృష్ణారావు అన్నారు. ముదిరాజ్‌లతో పాటు మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీ వర్గీకరణకు సంబంధించి వస్తున్న అభ్యర్థనలను న్యాయ బద్ధంగా పరిశీలిస్తామని తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఆయా వర్గాలకు మెరుగైన అవకాశాలు లభించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు అభివృద్ధి సాధించేలా ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు.

చెరువులు, రిజర్వాయర్లపై ఆధారపడి జీవి స్తున్న మత్స్యకారుల ఆదాయం పెరగాలం టే చేపల పెంపకంతో పాటు వాటి నిల్వ, విక్రయాలకు అవసరమైన మౌలిక సదుపా యాలు కల్పించాలని మంత్రి సూచించారు. కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయా ల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం చేపల ఉత్పత్తి చేసిన తర్వాత వాటిని సరైన విధంగా నిల్వ చేయడం, మార్కెట్‌కు తరలించడం వంటి అంశాల్లో మత్స్యకారులు ఎదుర్కొం టున్న ఇబ్బందులను అధిగమించేందుకు ఈ సదుపాయాలు ఉపయోగపడతాయ ని వివరించారు. చేపలకు మెరుగైన ధర లభించడంతో పాటు వృత్తిపై ఆధారపడిన కుటుంబాల ఆదాయం కూడా పెరుగుతుంద ని పేర్కొన్నారు.కల్వకోల్ పరిసర ప్రాంతాల్లో మత్స్య రంగ అభివృద్ధికి అవసరమైన ప్రణాళి కలు రూపొందిస్తామని జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న పథకాలు, అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలించి మత్స్యకా రులకు ప్రయోజనం చేకూర్చే చర్యలు చేపడ తామని తెలిపారు. చేపల పెంపకం నుంచి మార్కెటింగ్ వరకు ప్రతి దశలో మత్స్యకారు లకు తోడ్పాటు అందించే విధంగా సదుపా యాల కల్పనపై దృష్టి సారిస్తామని చెప్పారు. అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సం దర్భంగా పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవి ష్కరించడం ద్వారా ఆయన పోరాట స్ఫూర్తిని గుర్తుచేసుకోవడంతో పాటు మత్స్యకారులు, ముదిరాజ్ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టు బడి ఉందనే సందేశాన్ని ఇచ్చారు.

మాదకద్రవ్యాల నిర్మూలన జాతీయ ప్రాధాన్యం: కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

దేశానికి అత్యంత విలువైన సంపద యువత అని, వారు వ్యసనాలకు బలి కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వాలు మాత్రమే కాకుండా ప్రజలు, కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు కూడా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చా రు. యువతలో అవగాహన పెంచడంతో పాటు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాజంలో ని ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో భాగస్వా ములు కావాలని కోరారు. ఈ సందర్భం గా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జయప్రకాశ్ నారాయణ ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేస్తామని కిషన్ రెడ్డితో పాటు కార్య క్రమంలో పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేశారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ ప్రజా చైతన్య ఉద్యమం మరింత విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు.

పల్నాడు వాటర్‌గ్రిడ్ పనులు నిలిపివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆమె అభిప్రాయపడ్డారు.

తాగునీటి అవసరాల పేరుతో ఏపీ ప్రభు త్వం ఇప్పటికే నాగార్జునసాగర్ నుంచి 2.8 టీఎంసీల నీటిని వినియోగిస్తోందని, ఇప్పుడు లిఫ్ట్ ద్వారా మరో 1.8 టీఎంసీలను తరలిం చేందుకు ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించా రు. గతంలో శ్రీశైలం ప్రాజెక్టు వద్ద పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం ద్వారా నీటి తరలింపు జరిగిందని గుర్తుచేశారు. ఇప్పుడు సాగర్‌పైనా అదే తరహా ప్రయత్నాలు జరు గుతున్నాయని విమర్శించారు. తొమ్మిది నెలలుగా ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నా తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం తెలి యకపోవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రే హోంశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న నేపథ్యంలో నిఘా వ్యవస్థ పని తీరుపైనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రాజెక్టు విషయంలో కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు స్పందించాలని కవిత కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ పొత్తులకే ప్రాధాన్యం ఇస్తున్నారా అని ప్రశ్నించారు. ఎంపీ రఘునందన్ రావు, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఈ అంశంపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. తెలంగాణకు చెందిన కేంద్ర ప్ర జాప్రతినిధులంతా ప్రధానమంత్రి వద్దకు వెళ్లి ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని కోరాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ కింద ఈ ప్రాజెక్టుకు కేంద్రం 50 శాతం నిధులు అం దిస్తోందని ఆరోపిస్తూ, ఆర్థిక సహాయాన్ని కూడా నిలిపివేయించేలా ఒత్తిడి తేవాలని అన్నారు.

వారం రోజుల్లోగా పల్నాడు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కవిత స్పష్టం చేశారు. లేకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో వేలాది మందితో నాగార్జునసాగర్ డ్యామ్‌ను ముట్టడిస్తామని ప్రకటించారు. ఆ ఆందోళనకు దారితీసే పరి స్థితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాగా, ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కూడా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పనులు ని లిపివేయాలని కేంద్ర జలశక్తి శాఖకు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు లేఖలు రాసినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి.

బీఆర్ఎస్‌లోకి ఖైరతాబాద్ నేతలు

- **ప్రవీణ్, శ్రీనాథ్ తదితరులకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానం**
- **రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని ధీమా**
- **హైదరాబాద్ అభివృద్ధి, తాగునీరు, విద్యుత్, వైద్యంపై ప్రభుత్వాన్ని నిలదీత**



హైదరాబాద్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎ స్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రా వు ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, శ్రీనాథ్‌తో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. తెలంగాణ భవన్‌లో ప్రతిరోజూ జరుగుతున్న చేరికలే కాంగ్రెస్ బలహీనపడుతోందనడానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ సంస్థ సర్వే నిర్వహించినా బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి వస్తుందని తేలుతోందని, ప్రజలు కేసీఆర్ నా యకత్వం వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డిపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రిని ప్రతిపక్షాలు మాత్రమే కాకుండా సొంత పార్టీ ఎమ్మెల్యేలే విమర్శి స్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వ పనితీరు, అవినీతి, లంచాల వ్యవహా రాలపై చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావించారు. రూ.5 లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఒక ఎమ్మెల్యే ఆరోపిస్తున్నారని, మరో ఎమ్మెల్యే పనులు కావాలంటే 20 శాతం లంచం ఇవ్వా ల్సి వస్తోందని చెబుతున్నారని పేర్కొన్నారు. సొంత పార్టీ నాయకుల నుంచే విమర్శలు ఎదురవుతుండటంతో ముఖ్యమంత్రి అసహ నానికి గురవుతున్నారని వ్యాఖ్యానించారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసిందని, త్వరలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని కూడా అన్నారు.

హైదరాబాద్ నగర అభివృద్ధి, బ్రాండ్ ఇమేజ్ విషయంలో గత బీఆర్ఎస్ పాలనతో ప్రస్తుత ప్రభుత్వాన్ని పోలుస్తూ హరీశ్‌రావు విమ ర్శలు గుప్పించారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, నగరాన్ని చూసి తాను న్యూయార్క్‌లో ఉన్నానా అని సూపర్ స్టార్ రజనీకాంత్ వ్యాఖ్యానించిన విషయాన్ని గు ర్తుచేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి పాలనలో హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆరోపించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రోజుకు వేల సంఖ్యలో వాటర్ ట్యాం కర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్ హయాంలో గోదావరి, కృష్ణా జలాలను తీసుకొచ్చి నగరానికి నీటి సరఫరా చేశామని, ఉచిత నల్లా నీటి పథకం అమలులో ఉండేదని పేర్కొన్నారు. ఇప్పుడు నీటి కొరతతో పాటు విద్యుత్ ఛార్జీల పెంపు, విద్యుత్ కోతలు ప్రజలను ఇబ్బందులకు గు రిచేస్తున్నాయని విమర్శించారు.నగరంలో పారిశుధ్యం, శాంతిభద్రతలు, వైద్య సదు పాయాలపైనా హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో ఏర్పాటు చేసిన 10 లక్షల సీసీ కెమెరాల్లో ప్రస్తుతం సుమారు ఐదు లక్షలు పనిచేయడం లేదని ఆరోపించారు. నగరంలో దోమల సమస్య, చెత్త నిర్వహణ, తాగునీటి ఇబ్బందులు పెరిగాయని అన్నారు. పరిశ్రమలు, ఐటీ రంగాలకు సంబంధించిన కీలక అధికారుల నియామకాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. బస్తీ దవాఖానాలు, టీ డయాగ్నస్టిక్ కేంద్రాల ద్వారా గతంలో 147 రకాల పరీక్షలు అందించామని, ప్రస్తుతం బస్తీ దవాఖానాల్లో మందులు కూడా అం దుబాటులో లేవని ఆరోపించారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలు నిలిచిపో యాయని, టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణం, సేవల పరిస్థితిపై ప్రభుత్వం సమాధానం చె ప్పాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల అమలులోనూ కాంగ్రెస్ ప్ర భుత్వం విఫలమైందని హరీశ్‌రావు విమర్శిం చారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని, రెండు లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక పోవడంతో విద్యార్థుల చదువులు ఇబ్బందు ల్లో పడుతున్నాయని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం తగిన స్థాయిలో నిధులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

ఉచిత ఐవీఎఫ్ చికిత్సతో సంతాన సాఫల్యం

హైదరాబాద్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): సంతానలేమితో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న దంపతులకు గాంధీ ఆసుపత్రి ఆశాకిరణంగా నిలుస్తోంది. ఉచితంగా అందిస్తున్న కృత్రిమ గర్భధారణ చికిత్స ద్వారా పలువురు దంపతులు తల్లి దండ్రులయ్యే కలను సాకారం చేసుకుంటు న్నారు. ఇటీవల ఈ చికిత్స ద్వారా ఒక దం పతులకు ముగ్గురు శిశువులు జన్మించడం విశేషంగా నిలిచింది.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా సంతాన సాఫల్య చికిత్స పొందలేకపోతున్న కుటుం బాలకు గాంధీ ఆసుపత్రిలో అందిస్తున్న ఉచిత ఐవీఎఫ్ సేవలు ఎంతో తోడ్పాటు నిస్తున్నాయి. సాధారణంగా ఈ చికిత్సకు అధిక వ్యయం అవుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాంటి వారికి ప్ర భుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందుబాటు లోకి రావడం ఉపశమనంగా మారింది. ఏళ్ల తరబడి సంతానం కోసం ఎదురుచూ సిన దంపతులు చికిత్స అనంతరం తల్లిదం డ్రులుగా మారుతుండటం ఆసుపత్రి వైద్య సేవల్లో కీలక పరిణామంగా నిలుస్తోంది. ఇటీవల ముగ్గురు శిశువులు జన్మించిన ఘటన ఈ సేవలపై మరింత ఆసక్తిని పెంచింది. సంతానలేమితో బాధపడుతున్న కుటుంబాలకు వైద్యపరమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయనే నమ్మకాన్ని కల్పిస్తోంది.

ఈ సేవలను అందించడంలో కృషి చేస్తు న్న వైద్యులు, ఐవీఎఫ్ నిపుణులు, పిండ శాస్త్రవేత్తలు, నర్సులు, గాంధీ ఐవీఎఫ్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి దంపతుల పరిస్థితిని అర్థం చేసుకుని, బాధ్యతతో కూడిన వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది నిబద్ధతను ప్రశంసించారు. వారి సమిష్టి కృషి వల్లే పలువురు కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు మాతృత్వం, పితృత్వం కలలకు అడ్డంకిగా మారకూడదని ఈ సం దర్భంగా అభిప్రాయపడ్డారు. నాణ్యమైన సంతాన సాఫల్య చికిత్స ప్రతి అర్హమైన కుటుంబానికీ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలను అందించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుం బాలకు కూడా మెరుగైన చికిత్స పొందే అవకాశం కల్పించవచ్చని ఈ కార్యక్రమం చాటిచెబుతోంది.

మృతులైన గిగ్ వర్కర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం


హైదరాబాద్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల కు టుంబాలకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఇటీవల మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు సంబంధిత సహాయం చెక్కులను కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అందజే శారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. మర ణించిన స్విగ్గీ డెలివరీ భాగస్వామి వల్లూరి సందీప్ కుటుంబానికి మంత్రి ఆర్థిక సహాయం అందించారు. అలాగే విధి ని ర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉబర్ డ్రైవర్ అలుగోలా శ్యామ్ కుటుంబానికి కూడా చెక్కు అందజేశారు. కుటుంబాల జీవనోపాధి కోసం ప్రతిరోజూ శ్రమించే కా ర్మికులు అనేక ప్రమాదాలను ఎదుర్కొంటు న్నారని, వారి కుటుంబాలు అకస్మాత్తుగా ఆధారాన్ని కోల్పోయే పరిస్థితి వస్తోందని మంత్రి పేర్కొన్నారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఎదుర్కొంటున్న ప్రమాదాలు, వారి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సహాయం అందించడం అవసరమని వివేక్ వెంకట స్వామి తెలిపారు. కార్మికులు మరణించిన ప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా కొంతమేర అండగా ని లవవచ్చని చెప్పారు. ఈ సహాయం బాధిత కుటుంబాలకు కష్టకాలంలో తోడ్పడుతుం దని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించడంతో పాటు, విధి నిర్వ హణలో ప్రమాదాలు ఎదురైనప్పుడు వారి కుటుంబాలను ఆదుకునే చర్యలకు ప్రాధా న్యం ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షు డు షేక్ సలావుద్దీన్ పాల్గొన్నారు. కార్మి కుల సంక్షేమం, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ సంకల్పమని మంత్రి పునరుద్ఘాటించారు. గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే దిశగా మరిన్ని చర్యలు అవసరమని ఈ సందర్భంగా ప్రస్తా వించారు.

ఒక్క ఫొటో వేల భావాలను పలికిస్తుంది

- **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

హైదరాబాద్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): ఒక వార్తను వందల పదాలతో వివరించవచ్చని, అదే విషయాన్ని ఒక్క ఫొటో క్షణాల్లోనే వేల భావాలతో ప్రజల హృ దయాలకు చేరవేస్తుందని తెలంగాణ శాస నసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. చరిత్రలోని కీలక ఘట్టాలను భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బాధ్యత ఫొటో జర్నలిస్టులపై ఉందని కొనియాడారు. హైద రాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటో జర్నలిస్టుల అవార్డుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఫొటో జర్నలిజం సమాజంలోని వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించే శక్తివంతమైన మాధ్యమమని వివరించారు. ఒక సంఘటనలోని ముఖ్యమైన క్షణాన్ని చిత్ర రూపంలో బంధించి ప్రజలకు చేరవే యడం ప్రత్యేక నైపుణ్యంతో కూడుకున్నదని అన్నారు. చరిత్రలో నిలిచిపోయే అనేక ఘట నలకు ఫొటోలు సాక్ష్యాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.మారుతున్న సాంకేతిక పరిజ్ఞా నానికి అనుగుణంగా ఫొటో జర్నలిస్టులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని సూచించారు. కొత్త సాం కేతికతను అందిపుచ్చుకుంటూ వృత్తిలో మరింత నైపుణ్యం సాధించాలని ఆకాంక్షిం చారు. వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కొ నేందుకు నిరంతర అభ్యాసం అవసరమని తెలిపారు.ఫొటో జర్నలిస్టుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు తెలంగాణ ప్రజా ప్రభు త్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టులు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి, వారి సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. మీడియా రంగంలో పనిచేస్తున్న వారి వృత్తిపరమైన గౌరవం, భద్రతకు ప్రా ధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొ న్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొ టోగ్రఫీ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఫొటో జర్నలిస్టులకు స్పీకర్ అవార్డులు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ఫొటో జర్నలిస్టులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 22 - నవంబర్ 2026
వరంగల్ 03

రూ.549 కోట్ల సైబర్ క్రైమ్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

- **సత్తుపల్లికి చెందిన ఇద్దరిని హైదరాబాద్‌కు తరలింపు.. అరెస్టుల సంఖ్య 59కి చేరిక.**



సత్తుపల్లి, నవంబరు 21 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రూ.549 కోట్ల సైబర్ క్రైమ్ కేసులో శనివారం మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) ఏసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ పోలీసులు సత్తుపల్లి పట్టణానికి చెందిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గుడిపాడు రోడ్డుకు చెందిన బొప్పన ఖాదర్ బాబు, బొప్పన నాగ పవన్‌లను శనివారం ఉదయం అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌లోని సీఎస్‌బీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులో ఇప్పటికే 57 మందిని అరెస్టు చేసి విచారించిన అనంతరం రిమాండ్‌కు తరలించగా, తాజాగా మరో ఇద్దరి అరెస్టుతో మొత్తం నిందితుల సంఖ్య 59కి చేరింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైబర్ నేరాలపై కఠినంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ భారీ సైబర్ క్రైమ్ కేసు దర్యాప్తు వేగవంతమైంది. తాజాగా మరో ఇద్దరి అరెస్టుతో కేసు కీలక మలుపు తిరిగినట్లు చర్చ సాగుతోంది.

పెద్దమందడి–వనపర్తి రోడ్డు పనులు చేపట్టాలి

- **సింగిరెడ్డి కురుమూర్తి, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి**



పెద్దమందడి,నవంబర్21(తెలంగాణ ముచ్చట్లు): పెద్దమందడి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వనపర్తికి వెళ్లే రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ పెద్దమందడి మండల అధికార ప్రతినిధి సింగిరెడ్డి కురుమూర్తి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దమందడి నుంచి వనపర్తికి వెళ్లే మార్గంలో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర నిర్వహించి, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తుచేశారు.అయితే రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ, నేటికీ పనులు పూర్తి స్థాయిలో కొనసాగకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల సమయంలో, ప్రజా సమస్యలపై హామీలు ఇవ్వడమే కాకుండా వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెద్దమందడి-వనపర్తి రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాశ్వత రహదారి సౌకర్యం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు .ఈ సందర్భంగా 7వ వార్డు సభ్యుడు కొమ్ము బ్రహ్మయ్య, 5వ వార్డు సభ్యుడు కొమ్ము విష్ణు తదితరులు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు.

పోతిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రారంభం



- **పేద కుటుంబాలకు జీవిత బీమా కొండంత భరోసా.. కాంగ్రెస్ నాయకులు**

వీణవంక, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని, కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గ్రామంలోని అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో గ్రామ కార్యదర్శిని సంప్రదించి వెంటనే జీవిత బీమా నమోదు చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పంజాల సతీష్ గౌడ్, చేపూరి రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు రాపర్తి రవి, ఉప సర్పంచ్ రాపర్తి సంధ్య, కొమురయ్య గౌడ్, ఆరో వార్డు సభ్యుడు చేపూరి శ్రీకాంత్, చందుపట్ల శ్రీధర్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



పెద్దమందడి,నవంబర్21(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామానికి చెందిన శివ యాదవ్, రాముల యాదవ్ కుటుంబాలు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఆయన సతీమణి శారదారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన వస్త్రాలను అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత ఇల్లు నిర్మించుకోవడం ప్రతి ఒక్కరి కల అని, ఆ కలను సాకారం చేసుకోవడం ఎంతో ఆనందకరమైన విషయమని అన్నారు. సొంతింటి కల నెరవేరినప్పుడే కుటుంబానికి భరోసా, భద్రత కలుగుతాయని పేర్కొంటూ నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పెద్దమందడి మాజీ సర్పంచ్ వెంకటస్వామి, గౌని వెంకటేశ్వర రెడ్డి, చింతల వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



పెద్దమందడి,నవంబర్21(తెలంగాణ ముచ్చట్లు): ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా పెద్దమందడిలోని మత్స్యశాఖ కమిటీ హాలు సమీపంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధ్యక్షుడు వాకిటి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో జెండా ఎగుర వేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు వాకిటి నరేష్ కుమార్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. సమాజంలో మత్స్యకారుల పాత్ర ఎంతో కీలకమని, వారి కష్టానికి తగిన గుర్తింపు, గౌరవం లభించాలని పేర్కొన్నారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఉపాధ్యక్షుడు వాటి రమేష్, కార్యదర్శి జంగం రమేష్, మాజీ అధ్యక్షులు ఎన్. కురుమూర్తి, వి. నాగభూషణ్, ఎన్. రామాంజనేయులు, ఈ. మహేష్, కొత్త వెంకటన్న, అపంగాపురం నాగభూషణ్, చిన్న ఆంజనేయులు, ఈ. శ్రీనివాసులు, బాలరాజు, కే. పరమేష్, కే. వెంకటేష్, ఎన్. భాస్కర్, కొత్త స్వామి, కొత్త నాగన్న, జంగం శంకర్ తదితర మత్స్యశాఖ సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

చెకుముఖి ప్రతిభా పరీక్షలో మండల ఫస్ట్ శ్రీ ఆదర్శ

ఖమ్మం బ్యూరో, నవంబర్ 21(తెలంగాణ ముచ్చట్లు): చెకుముకి మండల స్థాయి ప్రతిభ పరీక్షలో చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయం విద్యార్థులు మండల ప్రథమ స్థానం సాధించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పందిళ్ళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష శనివారం నిర్వహించారు. ఈ మండల స్థాయి పరీక్షకు 15 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీ ఆదర్శ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని మందా నిరోష, 9వ తరగతి విద్యార్థి చక్కిలాల రాజేష్, 8వ తరగతి విద్యార్థి రౌతు శ్రీరంగ ధనుష్‌లు మండల స్థాయి ప్రథమ స్థానం సాధించారు. విజేతలైన విద్యార్థులకు డిసి ఈ బీ కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, ఎంఈఓ సలాది రామారావు, పాఠశాల



హెచ్ఎం దొండపాటి వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు.

తెలంగాణ ఉద్యమ పోరాట స్ఫూర్తిని చాటుతూ దీక్షా దివస్ మహాసభను విజయవంతం చేయాలి

- **నవంబర్ 29న అల్గునూర్ సభకు భారీగా తరలిరావాలి: డాక్టర్ రసమయి బాలకిషన్**



మనకొండూర్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటం, త్యాగాల స్ఫూర్తిని నేటి తరానికి చాటిచెప్పాలని మనకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. ఈ నెల 29న కరీంనగర్‌లోని అల్గునూర్ చౌరస్తా సమీపంలో నిర్వహించనున్న దీక్షా దివస్ స్ఫూర్తి మహా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు.

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో డాక్టర్ రసమయి బాలకిషన్ పాల్గొని మాట్లాడారు. 'కేసీఆర్ సచ్చుడో..తెలంగాణ వచ్చుడో' అనే నినాదంతో కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష, తీసుకున్న పటిష్టమైన నిర్ణయం ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని పేర్కొన్నారు. ఆ చారిత్రక పోరాటాన్ని ప్రజలకు, నేటి తరానికి వివరించడమే దీక్షా దివస్ సభ ముఖ్య ఉద్దేశమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని, కొత్త పథకాల కంటే కరువు పరిస్థితులే కనిపిస్తున్నాయని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో మరోసారి ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని, బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- **సూపరింటెండెంట్‌గా సీనియర్ వైద్యులు డాక్టర్ వాసుదేవరెడ్డి నియామకం**



హుజురాబాద్,నవంబర్ 21(తెలంగాణ ముచ్చట్లు): హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సీనియర్ వైద్యులు డాక్టర్ వాసుదేవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్) డాక్టర్ కృష్ణ ప్రసాద్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం డాక్టర్ వాసుదేవరెడ్డి శనివారం ఆసుపత్రిలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

బాధ్యతల స్వీకరణ అనంతరం డాక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ..

తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన డీసీహెచ్ కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆసుపత్రికి మరింత మంచి పేరు తీసుకురావాలని కోరారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్, పి. శ్రీకాంత్‌రెడ్డి, పాతిమెడికల్ మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొని డాక్టర్ వాసుదేవరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు



వనపర్తి,నవంబర్21(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి పట్టణంలోని ఆర్జీ గార్డెన్‌లో ఉపాధ్యాయులు బొరెల్లి వెంకటయ్య కుమార్తె ఖ్యాతి సుధన్, శివ కుమార్‌ల వివాహ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు,సామాజికనాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు, జి.పి. కీరన్ కుమార్, ఏఐఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డాల కృష్ణ, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కొల్లా వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కేశపోగు కేశవులు, కొమ్ము చెన్నకేశవులు, గంధం గట్టయ్య, శివన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. వధూవరుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

దళితుల ఆసరా పెన్షన్లపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తాం..**
- **కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దొగ్గల భాస్కర్**



జమ్మికుంట, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): హుజురాబాద్ నియోజకవర్గంలో దళితులకు గతంలో దళితబంధు పథకం అమలైనందున వారికి ఆసరా పెన్షన్లు రావని, ఇప్పటికే పెన్షన్లు రద్దయ్యాయని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జమ్మికుంట మండల అధ్యక్షుడు దొగ్గల భాస్కర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతమంది అవకాశవాదులు ప్రజాపాలన ప్రభుత్వంపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు కొత్తగా పెన్షన్లు మంజూరు చేయని పరిస్థితి ఉండేదని విమర్శించారు. ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆసరా పెన్షన్ మంజూరు ప్రొసీడింగ్స్ కాపీలు అందుకున్న వారికి మాత్రమే పెన్షన్లు వస్తాయనే ప్రచారం కూడా అవాస్తవమని పేర్కొన్నారు. అర్హత కలిగిన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులతో పాటు అర్హులైన దళితులందరికీ ప్రభుత్వం ఆసరా పెన్షన్లు అందిస్తుందని తెలిపారు. ఇతర రాజకీయ పార్టీల నాయకులు లేదా ఎవరైనా చెప్పే అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. అర్హులైన దళితులందరికీ త్వరలోనే పెన్షన్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా భాస్కర్ స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కోరపల్లి విద్యార్థిని ఎంపిక



- **ప్రతిభ చాటిన పింగిలి అక్షర..**
- **ఉపాధ్యాయులు, గ్రామస్తుల అభినందనలు**



జమ్మికుంట, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఈ నెల 20న నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్ 14 బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్‌లో కోరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పింగిలి అక్షర అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది.
ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరులో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అక్షర పాల్గొననుంది. విద్యార్థిని ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు జిట్టబోయిన శ్రీను హర్షం వ్యక్తం చేశారు.క్రీడల్లో మరింత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల జమ్మికుంట మండల విద్యాధికారి మంథని హేమలత, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రజిత, సర్పంచ్ మధుసూదన్, ఉప సర్పంచ్ రాజు యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామ యువకులు, ప్రజలు అక్షరకు అభినందనలు తెలియజేశారు.





ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ‘కేఎన్ఆర్ మార్నింగ్ వాక్’

- **అంబేడ్కర్ స్టేడియంలో వాకర్లతో మమేకమైన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

కరీంనగర్, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ‘కేఎన్ఆర్ మార్నింగ్ వాక్’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం అంబేడ్కర్ స్టేడియంలో మార్నింగ్ వాక్ నిర్వహించి వాకర్లు, క్రీడాకారులతో మమేకమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
అంబేడ్కర్ స్టేడియం వాకర్లు, క్రీడాకారుల విజ్ఞప్తిమేరకు గతంలో సుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, అప్పట్లోకేటాయించిన సుడా నిధుల నుంచి రూ.95 లక్షలతో సింథటిక్ ట్రాక్ పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. స్టేడియంలోని మరుగుదొడ్లు దెబ్బతినడంతో మార్నింగ్ వాక్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్తులు, క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాకర్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన నరేందర్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో మరుగుదొడ్ల మరమ్మతు పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో ‘కేఎన్ఆర్ మార్నింగ్ వాక్’ నిర్వహిస్తూ ప్రజల వద్దకు వెళ్తానని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ స్టేడియం వాకర్లు, క్రీడాకారులు, స్థానిక ప్రజలు పాల్గొని తమ సమస్యలను కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకుపచ్చారు.





ప్రజాసేవే పరమావధిగా.. తిమ్మాపూర్‌లో ‘‘పెండ్లి’’ వారి సేవా ప్రస్థానం

జఫర్గడ్,నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు) మండలం లోని తిమ్మాపూర్ గ్రామంలో 'పెండ్లి' వారి కుటుంబం అంటే కేవలం ఒక ఇంటి పేరు కాదు; అది ఊరి ప్రతి ఇంటిలో ఒక ఆత్మీయ బంధం, ప్రతి కుటుంబంలో ఒక బిడ్డగా నిలిచిన సేవా నిలయం. అధికారం ఉన్నా లేకపోయినా, పదవి ఉన్నా ఊడినా ప్రజల మధ్యే ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఆ కుటుంబం సంపాదించుకున్న విశ్వాసం నేటి తరం రాజకీయ నాయకులకు ఒక గొప్ప పాఠం.
ప్రజాసేవలో 'పెండ్లి' వారి ప్రస్థానం – ముఖ్యాంశాలు:
1999 ఉద్యమ పోరాటం - 6 నెలల జైలు జీవితం: ప్రజా సమస్యలు, హక్కుల సాధన కోసం 1999లో జరిగిన ఉద్యమంలో ముందుండి పోరాడి, ఏకంగా 6 నెలల పాటు జైలు జీవితాన్ని గడిపారు. ప్రజా ప్రయోజనాల కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడే వారి పోరాట పటిమకు ఇది నిదర్శనం.
2006లో సర్పంచ్‌గా మల్లారెడ్డి విజయం & వార్డు మెంబర్‌గా ఘనవిజయం: 2006లో జరిగిన ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున పెండ్లి మల్లారెడ్డి తిమ్మాపూర్ సర్పంచ్‌గా ఘన విజయం సాధించారు. అదే సమయంలో, తన తండ్రి పదవీకాలంలోనే వార్డు మెంబర్‌గా కూడా అత్యధిక మెజారిటీతో గెలుపొంది ప్రజాదరణను చాటుకున్నారు. అప్పటి నుంచి నేటి వరకు నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ, ఆపదలోనూసంపదలోనూ గ్రామస్తులకు అండగా నిలుస్తున్నారు.
2014లో ఆదర్శ రాజకీయ చాతుర్యం: 2014 ఎంపీటీసీ ఎన్నికల్లో పెండ్లి యాదగిరి టికెట్ ఆశించి భంగపడ్డారు. అయితే, నిరాశ చెందకుండా, ప్రజాసేవ ఆగకూడదనే సంకల్పంతో తన మేనల్లుడు సతీష్‌ను బరిలో నిలిపి విజయ తీరాలకు చేర్చారు. ఇది వారి రాజకీయ పరిణతికి, కార్యకర్తలపై ఉన్న నమ్మకానికి నిదర్శనం.
మండల స్థాయిలో మైత్రి: కేవలం తిమ్మాపూర్ గ్రామంలోనే కాకుండా, జఫర్‌ఘడ్ మండలంలోని ప్రతి వ్యక్తితోనూ స్నేహపూర్వకంగా మెలుగుతూ, ఎలాంటి భేషజాలు లేకుండా అందరి మనసులు గెలుచుకున్నారు.
ఉపస ర్పంచ్‌గా యాదగిరి బాధ్యతలు: ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ విజయకేతనం ఎగురవేసి, పెండ్లి యాదగిరి ఉపసర్పంచ్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రజలతో ఉన్న అనుబంధమే మరోసారి వారిని గెలిపించింది
మహిళా సంఘ భవనానికి స్థలదానం: గ్రామంలోని మహిళా సంఘ భవన నిర్మాణం కోసం తమ వంతు బాధ్యతగా 60 గజాల స్థలాన్ని కేటాయించి మహిళా సాధికారతకు, గ్రామ అభివృద్ధికి తమ చిత్తశుద్ధిని చాటుకున్నారు.
"మేమున్నాం" అనే భరోసా: ఊరిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా, ఏ అవసరం పడినా "మేము ఉన్నాము" అంటూ ముందుండే గుణం వల్ల వారికి గ్రామంలో ప్రత్యేక స్థానం లభించింది. ఈ కథనం నేర్పే రాజకీయ పాఠాలు
త్యాగనిరతే అసలైన నాయకత్వం: 1999 ఉద్యమంలో 6 నెలల జైలు జీవితాన్ని గ డ పడం ద్వారా, ప్రజల కోసం కష్టాలను ఎదుర్కొనే నాయకుడినే సమాజం ఎప్పటికీ గుండెల్లో పెట్టుకుంటుందని నిరూపించారు.
పదవి కంటే ప్రజాభిమానమే మిన్న: ప దవులు శాశ్వతం కాదు, కానీ ప్రజల గుండెల్లో సంపాదించుకునే స్థానం శాశ్వతం. 2006లో సర్పంచ్‌గా, అత్యధిక మెజారిటీతో వార్డు మెంబర్‌గా గెలిచినప్పటి నుంచి నేటి వరకు నిరంతర ప్రజాసంబంధాలే ఈ కుటుంబానికి నిజమైన బలం.
అవకాశం రాకపోయినా ఆగని సేవ: 2014లో తనకు టికెట్ దక్కకపోయినా, మేనల్లుడు సతీష్‌ను గెలిపించుకోవడం ద్వారా "లక్ష్యం ముఖ్యం కానీ, పదవీ కాంక్ష కాదు" అనే ఉన్నత రాజకీయ విలువను యాదగిరి నిరూపించారు.
ఇచ్చే గుణం & సామాజిక ఐక్యత: మహిళా సంఘ భవనానికి 60 గజాల స్థలం ఇవ్వడం మాటల కంటే చేతలకే ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తిత్వానికి నిదర్శనం. ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడటం, మండలంలోని ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించడం వల్ల ఏర్పడే సామాజిక ఐక్యత ఏ ఎన్నికల్లోనైనా గెలిపించే అసలైన శక్తి.
రాజకీయం అంటే కేవలం గెలుపోటముల లెక్కలు కాదు; అది ప్రజల కన్నీళ్లు తుడిచే బాధ్యత, వారి ఆశలకు ఊపిరి పోసే సేవ. తిమ్మాపూర్‌లో 'పెండ్లి' వారి కుటుంబం సాగిస్తున్న ఈ ప్రయాణం—పోరాట పటిమ, నిజాయితీ, సేవానిరతి, ఆత్మీయత కలగలిసిన ఆదర్శ రాజకీయానికి ఒక సజీవ రూపం.

కాషాయ సైన్యం కదం తొక్కాలి.. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి!

- **23న కరీంనగర్‌లో లక్ష మందితో మహా పాదయాత్ర..**
- **ఎల్కతుర్తి నుంచి భారీగా తరలిరావాలని శ్రీకాంత్ యాదవ్ పిలుపు**

ఎల్కతుర్తి నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): కాషాయ సైన్యం ఐక్యంగా కదిలి దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరిగే తప్పుడు ప్రచారాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ నెల 23న కరీంనగర్‌లో నిర్వహించనున్న లక్ష మందితో కూడిన మహా పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ఎల్కతుర్తి మండల కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల ప్రభారి లక్కిరెడ్డి తిరుమల పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి ప్రచారాలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల్లోకి వెళ్లి తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై దేశ యువత విశ్వాసంతో ఉందని, దేశ అభివృద్ధి, జాతీయ భద్రత, దేశ స్వాభిమానం విషయంలో యువత మోదీకి అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మహా పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని తెలిపారు.
ఈ నెల 23న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో లక్ష మందితో భారీ మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని తెలిపారు.ఎల్కతుర్తి మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహా పాదయాత్రను విజయవంతం చేయాలని శ్రీకాంత్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త కాషాయ సైనికుడిలా ముందుకు సాగి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహా పాదయాత్ర విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 22 - నవంబర్ 2026
వరంగల్ 05

గురువుపై గౌరవం.. రెండు దశాబ్దాలైనా చెరగని అనుబంధం



- **గురువు కుమార్తె వివాహానికి రూ.90 వేల ఆర్థిక సాయం**
- **కాకతీయ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఔదార్యం**

జమ్మికుంట, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): గురువు నేర్పిన విద్యాబుద్ధులు, చూపిన మార్గం విద్యార్థుల జీవితాల్లో ఎంతటి ప్రభావాన్ని చూపుతాయో కాకతీయ హైస్కూల్ 2004-05 పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ ఆచరణతో చాటిచెప్పారు. చదువు చెప్పిన గురువు భౌతికంగా దూరమైనా ఆయనపై గౌరవం, ఆయన కుటుంబంపై ఆప్యాయతను రెండు దశాబ్దాలైనా మరువకుండా గురువు కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందించి తమ గురుభక్తిని చాటుకున్నారు.

జమ్మికుంటలోని కాకతీయ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ గురువు కీర్తిశేషులు బుర్ర సంజీవ్ ప్రథమ కుమార్తె మధుహాసిని-సాయి కృష్ణ వివాహాన్ని పురస్కరించుకుని మొత్తం రూ.90 వేల ఆర్థిక సహాయాన్ని సమకూర్చి అందజేశారు. ఇందులో రూ.60 వేల నగదును చెక్కు రూపంలో, రూ.15 వేల విలువైన బీరువా, కూలర్‌ను 2005-06 బ్యాచ్ విద్యార్థుల తరపున అందించారు. మరో రూ.15 వేలతో చిన్నారి కళాశాల ఫీజు చెల్లించి కుటుంబానికి అండగా నిలిచారు.

గతంలో 2012లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలోనూ గురువు సంజీవ్ కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సహాయం అందించడం విశేషం. గురువు భౌతికంగా తమ మధ్య లేకపోయినా ఆయన నేర్పిన విలువలు, అందించిన విద్య, మధుర జ్ఞాపకాలు తమ హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా మరోసారి నిరూపించారు.

వివాహ వేడుకకు హాజరైన బంధు మిత్రులు, కుటుంబ సభ్యులు పూర్వ విద్యార్థులు గురువు కుటుంబంపై చూపిన ప్రేమాభిమానాలు, బాధ్యత, సేవాభావాన్ని అభినందించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువు కుటుంబాన్ని తమ కుటుంబంగా భావించి వారి కష్ట సుఖాల్లో తోడుగా నిలవడం సమాజానికి గొప్ప సందేశమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో అంబీరి శ్రీకాంత్, జక్కు రజనీకాంత్, పైండ్ల రాజేష్ రెడ్డి, పిల్లల శ్రీనివాస్, నాగలగని మధు, వొల్లల అజయ్, పలకల చంద్ర రెడ్డి, కండెం రాజేష్, పొద్దుటూరి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గురువుపై గౌరవం, మానవత్వం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే సేవాభావం ఉంటే సమాజంలో మంచి మార్పులు సాధ్యమవుతాయని ఈ పూర్వ విద్యార్థులు తమ సేవా కార్యక్రమంతో చాటిచెప్పారు.


వేలేరులో చెకుముకి మండలస్థాయి పరీక్షలు



- **విజేతలుగా జడ్పీహెచ్ఎస్ వేలేరు, కేజీబీవీ వేలేరు, సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలు**

వేలేరు, నవంబర్ 21 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని టీజీఆర్ఎస్ బాలుర పాఠశాలలో ఈరోజు చెకుముకి మండలస్థాయి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి చంద్రమౌళి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. అజయ్ కుమార్, మండల అధ్యక్షుడు గుడికందుల రమేష్ హాజరయ్యారు. వీరితో పాటు మండలంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జడ్పీహెచ్ఎస్ వేలేరు ప్రథమ బహుమతి, ఎర్రబెల్లి పాఠశాల ద్వితీయ బహుమతి సాధించాయి. గురుకులాల విభాగంలో కేజీబీవీ వేలేరు ప్రథమ బహుమతి, టీజీఆర్ఎస్ జూనియర్ కళాశాల వేలేరు ద్వితీయ బహుమతి సాధించాయి. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల ప్రథమ బహుమతి గెలుచుకుంది. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి చంద్రమౌళి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులందరూ ఈ నెల 28న నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి పరీక్షల్లో తప్పనిసరిగా పాల్గొని ప్రతిభ చాటాలని నిర్వాహకులు కోరారు. మండల అధ్యక్షుడు గుడికందుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు.

పీచరలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



- **ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా.. సర్పంచ్ మరిజె అనిత నర్సింహారావు**

